## పెద్దోళ్లపై ఆరోపణలు చేస్తే పెద్దోళ్లు కారు

- అలా అనుకోవడం మూర్ఖత్వమే..
- కేఆర్ నాగరాజు.. పద్ధతిగా మాట్లాడ్డం నేర్చుకో..
- వర్ధన్నపేట ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పడం ఖాయం
- రైతుబంధు సమితి అధ్యక్షురాలు లలితా యాదవ్

న్యూశాయంపేట, నవంబర్ 13: రాజకీయాల్లో పెద్దోళ్లపై అసత్య ఆరోపణలు చేస్తే పెద్దోళ్లమైపోతామకుంటే మూర్ఖత్వమేనని రైతుబంధు సమితి అధ్యక్షురాలు లలితా యాదవ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని అరూరి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి కేఆర్ నాగరాజు ఇంకా పోలీస్ అనే భ్రమలో అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, పోలీస్ ఆఫీసర్‌గా సర్వీస్‌లో ఉన్నప్పుడు పెట్టిన అక్రమ కేసులు గుర్తుకొచ్చి రిటైరయ్యాక కూడా కేసులు పెడతానని కలవరిస్తున్నారని అన్నారు. 14నెలల పాటు నిజామాబాద్‌లో చేసిన అక్రమాలపై అక్కడి పత్రికల్లో వచ్చిన వార్తలను మరిచావా? అని ప్రశ్నించారు. రిటైర్ అయినప్పుడు అక్కడి ప్రజలు పటాకులు పేల్చి సంబరాలు చేసుకున్న విషయాన్ని మర్చిపోయావా? అని ఎద్దేవా చేశారు. నాగరాజు సర్వీస్‌లో ఉన్నప్పుడు చేసిన తప్పులకు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. అబద్ధాలను ప్రచారం చేయాలని చూస్తున్న కేఆర్ నాగరాజుకు ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. బీఆర్ఎస్ వర్ధన్నపేట అధికార ప్రతినిధి మిద్దపాక రవీందర్, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ మాట్లాడుతూ ఎవరు ఎన్ని కుట్రలు చేసినా అరూరి రమేశ్‌ను ఏమీ చేయలేరన్నారు. లక్ష మెజార్టీతో అరూరి రమేశ్‌ను గెలిపిస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, దోపతి జయపాల్‌రెడ్డి, ఎల్లావుల కుమార్ యాదవ్, మాదాసు బాబు, శేఖర్, సుభాష్‌గౌడ్, ప్రసాద్, ఎంపీపీ కేతాపాక సునీత, జక్కు రమేశ్ గౌడ్, బండ రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## నేతకాని బతుకమ్మ సంబురాలు ప్రారంభం

### సీతంపేటలో దీపావళి సందర్భంగా మూడు రోజుల పాటు ఉత్సవాలు

హసన్‌పర్తి, నవంబర్ 13 : మండలంలోని సీతంపేటలో దీపావళి పండుగ సందర్భంగా నేతకాని కులస్తులు మూడు రోజు పాటు నిర్వహించే బతుకమ్మ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. దీపావళి పండుగ (బతుకమ్మ) రోజు చెరువు నుంచి మట్టిని తీసుకువచ్చి దేవతామూర్తుల ప్రతిమలు (ఎద్దులు) తయారు చేయారు. ప్రతిమలను ప్రత్యేక గదిలో ప్రతిష్ఠించి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. మంగళవారం పురుషులు ఉపవాస దీక్షలు చేపడుతారు. సాయంత్రం ఇండ్లలో ప్రతిష్ఠించిన దేవతామూర్తుల ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేస్తారు. అనంతరం పురుషులు అక్కడే ఉపవాస దీక్షలు విరమిస్తారు. పాత్రల్లో చెరువు నుంచి జలాన్ని తీసుకువచ్చి ప్రత్యేక గదిలో పెట్టి పూజలు చేస్తారు. మూడో రోజు మహిళలు గౌరమ్మల (బతుకమ్మ)ను తయారు చేసి కోలాటాలతో పాటలు పాడుతూ ఊరేగింపుగా బయల్దేరుతారు. వేడుకల్లో పురుషులు, మహిళలు బతుకమ్మలతో రెండు కిలోమీటర్లు ర్యాలీ తీసి బతుకమ్మ ఆడుతారు. ప్రజాప్రతినిధులు, చుట్టుపక్కల గ్రామాలతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి ప్రజలు సీతంపేటకు వచ్చి ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటారు.



చెరువు నుంచి మట్టిని తీసుకువస్తున్న నేతకాని కులస్తులు

## పోలింగ్ ఏర్పాట్లపై దృష్టిసారించాలి

ఐనవోలు, నవంబర్ 13: ఎన్నికల సిబ్బంది పోలింగ్ ఏర్పాట్లపై దృష్టిసారించాలని జనరల్ ఎన్నికల అబ్జర్వర్ ఐఏఎస్ షణ్ముఖ రాజన్ సూచించారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో 166 నుంచి 170 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లును పరిశీలించారు. మరణించి ఓటర్లను ఏ విధంగా తొలగించారు? ఆయా పోలింగ్ బూత్‌ల్లో దివ్యాంగుల వివరాలు, ఓటు హక్కులను ఎలా వినియోగించుకుంటారు? పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకునే వారి సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ అధికారులు ఎంతమందిని బైండోవర్ చేశారు? సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారనే అంశాలపై ఆరా తీశారు. స్థానిక తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ప్రొహిబిషన్ ఎస్సై శ్రీనివాస్, లైజన్ ఆఫీసర్ వర్ధన్నపేట డీటీ వినయ్‌ధర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ కిశోర్ ఉన్నారు.



కాశీబుగ్గ: బీఆర్ఎస్ పార్టీలోకి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న అరూరి రమేశ్



న్యూశాయంపేట: గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరూరి

# బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

- ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్
- కాంగ్రెస్, బీజేపీ నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరికలు
- క్యాంప్ ఆఫీస్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే

వర్ధన్నపేట, నవంబర్ 13: తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. మండలంలోని ఇల్లందకు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం బీఆర్ఎస్‌లో చేరడంతో వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రెండుసార్లు ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించినట్లు వివరించారు. ఎన్నికల్లో హామీ ఇవ్వని సంక్షేమ పథకాలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసి పేదల సంక్షేమానికి విశేషంగా కృషి చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని మూడోసారి కూడా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన ఇల్లందకు చెందిన పిట్టల రాజు, పిట్టల స్వప్న, చీపురు వెంకటస్వామి, ఎండీ యాకూబ్‌పాషా, సఫియా, నిమ్మనబోయిన కిశోర్‌తో పాటు మరో 100 మందికి గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌ఖన్నా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, సర్పంచ్ సాంబయ్య, ఏరుకొండ వేణుగోపాల్‌రావు, ఎల్లస్వామి పాల్గొన్నారు.



ఇల్లంద బీజేపీ నాయకులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

### విలీన గ్రామాల్లో అభివృద్ధి చూడండి

కాశీబుగ్గ: వర్ధన్నపేట నియోజకవర్గ విలీన గ్రామాల అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి దీవించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. ఆదివారం 14వ డివిజన్‌లోని సుందరయ్యనగర్‌లో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండ్రాతి భాస్కర్ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి అరూరి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నిరుపేద, మధ్యతరగతి ప్రజల అభివృద్ధే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. తాను చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే ప్రజలు ఆగమవుతారని అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. కార్పొరేటర్ సులోచన, డివిజన్ అధ్యక్షులు ముడుసు నరసింహా, దుబ్బ శ్రీనివాస్, కేతిరి రాజశేఖర్, జంగం రాజు, గండ్రాతి నవీన్, సత్వాడి సంతోష్, అంకేశ్వరపు సతీష్, ఎండీ సలీం, కొత్తపెల్లి అనిల్, సునిల్, మామిడాల లింగమూర్తి, మార్జోడు నవీన్, మాచన రాజేశ్, కె.నాగరాజు పాల్గొన్నారు.

### భట్టుపల్లి మాల కులస్తుల మద్దతు

న్యూశాయంపేట: హనుమకొండ హంటర్‌రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ఆది, సోమవారాల్లో బీఎస్పీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు సంకినేని మధుతోపాటు 100 మంది, 43, 44, 65 డివిజన్‌లోని పలు పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి అరూరి రమేశ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భట్టుపల్లి మాల కులస్తులు ఏకగ్రీవంగా బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావడంతో ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. కేసీఆర్ జనరంజక పాలన చూసి, అభివృద్ధిని కాంక్షిస్తూ వివిధ పార్టీలు, సంఘాల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కార్పొరేటర్ దివ్యారాణి, వర్ధన్నపేట ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూరారం నిరంజన్, 44వ డివిజన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కాజీపేట మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, 43వ డివిజన్ అధ్యక్షులు స్పందన్, మైదం శేఖర్, బాబు విక్టర్, రాజునాయక్, కర్నాకర్ సాగర్, నాగరాజు పాల్గొన్నారు.




న్యూశాయంపేట: మద్దతు తెలుపుతున్న భట్టుపల్లి మాల కులస్తులు

# అభివృద్ధిని చూసి ఓటు వేయండి

హసన్‌పర్తి, నవంబర్ 13: గ్రేటర్ 55, 65 డివిజన్ పరిధిలోని భీమారం, అహల్యతండాలో ఎమ్మెల్యే అరూరి రమేశ్ గెలుపుకోసం 55డివిజన్‌ల కార్పొరేటర్ జక్కుల రజితా వెంకటేశ్వర్లు, 65వ డివిజన్ కార్పొరేటర్ గుగులోత్ దివ్యరాణీ రాజునాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఓటరును కలిసి కారు గుర్తుకు ఓటువేసి అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరారు. 55వ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, గ్రామ అధ్యక్షుడు సురేశ్, లావుడ్య సురేశ్, భూక్య యమహరాజ్, రాజ్‌కుమార్, జామ్లా, సాయికిరణ్, వరుణ్, రవి, రాజు, మదన్‌లాల్, సురేశ్, సమ్మయ్య, లింగయ్య, వెంకటేశ్, రమేశ్, రాజేందర్, లింగు, వినయ్, కుమార్, హరిశ్‌రావు, నరేశ్ పాల్గొన్నారు.

### ఎనుమాములలో బైక్ ర్యాలీ

కాశీబుగ్గ: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎనుమాముల నుంచి మార్కెట్ వరకు ద్విచక్రవాహనాలపై ర్యాలీ చేపట్టారు. కార్పొరేటర్ సులోచన, డివిజన్ అధ్యక్షుడు ముడుసు నరసింహా, నాయకులు యాదగిరి, పత్రి సుభాష్, రాజపోషాలు, గంధం గోవిందు, సవరం కళ్యాణ్, రాజు, అజయ్, మాధవి పాల్గొన్నారు.



అహల్య తండాలో ఇంటింటా ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ దివ్యరాణీ రాజునాయక్

## ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్‌గా రవీందర్

పర్వతగిరి, నవంబర్ 13: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం(540) రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్‌గా రాపాక రవీందర్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఆయన జగిత్యాల జిల్లా బీర్పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

## గొర్రెల పాకకు నిప్పు

హసన్‌పర్తి, నవంబర్ 13: మండలంలోని సిద్ధాపూర్‌లో ముస్కు గోపాల్(65)కు చెందిన గొర్రెల పాకకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆదివారం సాయంత్రం 50 గొర్రెలను పాకలో తోలి రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి గొర్రెల పాక నుంచి పొగరావడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు అతడిని నిద్రలేపగా వెంటనే కుటుంబ సభ్యులు బోరు వేసి మంటలను ఆర్పి గొర్రెలను బయలకు పంపారు. గొర్రెల పాక కాలిపోయింది. సోమవారం గోపాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తుమ్మ గోపి తెలిపారు.